# రామాభ్యుదయం - దశరథుని పుత్రప్రేమ

-- అపర్ణ యేలూరిపాటి

సాధారణంగా మన పెళ్ళిళ్ళలో నూతన వధూవరులు పెద్దలందరికీ నమస్కరించడం ఆనవాయితీ. వెంటనే వారికి పెద్దలు అందించే మొదటి దీవన "చక్కని సంతానాన్ని కనండి" (సుపుత్రావాప్తిరస్తు) అని. పొరపాటున అలా ఎవరైనా అనకపోతే మనకి ఎంతో వెలితిగాను, ఏదో లోటుగాను ఉంటుంది కూడాను. అసలు పెళ్ళికి పరమార్థం సంతానాన్ని కని భావితరాలను నిర్మాణం చేయటమేనని మన గ్రంథాల్లో ఎన్నోచోట్ల చెప్పబడింది (ధర్మప్రజా సంపత్యర్థం స్త్రియముద్వహే). అంటే పెళ్ళిద్వారా సంతానాభివృద్ధి, తద్వారా వంశాభివృద్ధి, తద్వారా సమాజాభివృద్ధి జరగాలనే ఆకాంక్ష.

అందుకే సంతానవంతులైనవారు ప్రపంచాన్నంతా జయించినంత ఆనందాన్నీ, గర్వాన్నీ పొందుతూ ఉంటారు. అలాగే పెళ్ళయ్యాక చాలాకాలందాకా సంతానం కలగకపోతే వారిని అందరూ "ఏంటి ఇంకా పిల్లల్ని కనే ఉద్దేశ్యాలేమీ లేవా?" అని అడగటంకూడా జరుగుతూ ఉంటుంది. ఎవరో అడగటందాకా ఎందుకు, ఆ జంటకే "మన కడుపుపంట ఇంకా కలగలేదుకదా" అని లోలోపల ఒకలాంటి ఆరాటం కలగటంకూడా సహజం. సంతానంకోసం దశరథమహారాజు పడిన అటువంటి ఆరాటాన్నే రాయల ఆస్థానకవి అయ్యలరాజు రామభద్రుడు తన రామాభ్యుదయంలో కళ్ళకు కట్టినట్టు వర్ణించాడు. పితృహృదయాన్ని మనకు ఆవిష్కరింపచేశాడు.

ఈ మొత్తం గ్రంథంలో దశరథునికి పుత్రులపట్ల ఉన్న ప్రేమ ముఖ్యంగా మూడుఘట్టాల్లో విశదంగా కనబడుతుంది. మొదటిది సంతానార్థం దశరథుడు పడే తపన, రెండవది విశ్వామిత్రుడు రామలక్ష్మణులను యాగసంరక్షణకోసం పంపమని అడిగినప్పుడు ఆయనను కాదనలేక, కుమారులను పంపలేక పడిన యాతన, మూడవది సీతారామలక్ష్మణులు వనవాసానికి వెళ్ళినప్పుడు అనుభవించిన వేదన. ఈ మూడుఘట్టాలూ దశరథుని పుత్రప్రేమకే కాదు మొత్తం రామాయణానికే తలమానికాలు. ఆయా ఘట్టాలను పరిశీలిస్తే –

దశరథునికి వేట అంటే మక్కువ. అలా ఒకసారి ఒక వేటకు వెళ్ళిన దశరథుడు ఒక సరస్సు సమీపంలో వేటాడుతుండగా, ఒక మునికుమారుడు కుండను నీటిలో ముంచిన శబ్దాన్ని విని, ఏ ఏనుగో జలం తాగుతోంది అని భావించి, శబ్దవేదివిద్యతో బాణాన్ని విడుస్తాడు. వెంటనే బాలుని ఆక్రందన వినవస్తుంది. ఆ శబ్దం వచ్చినచోట చూస్తే, ఒక మునిబాలుడు బాణవిద్ధుడై కనిపిస్తాడు. అది చూసి అదిరిపడిన దశరథుడు తప్పు చేసినందుకు దుఃఖిస్తాడు.

ఆ మునిబాలకుడు శ్రవణకుమారుడు. అతడే దశరథుణ్ణి ఓదార్చి, తన తల్లిదండ్రుల జాడను చెపుతాడు. దశరథుడు మునిబాలకుని తల్లిదండ్రుల వద్దకు చేర్చి, తన అపరాధాన్ని మన్నించమని వేడుకుంటాడు. కాని, మునిదంపతులు ఆయనను క్షమించరు. "మాకు పుత్రశోకాన్ని కలిగించావు కనుక నీవూ భవిష్యత్తులో పుత్రశోకాన్ని అనుభవిస్తావని శపిస్తారు. పశ్చాత్తప్తుడైన దశరథుడు ఎంత వేడుకున్నా మునిదంపతులు అతన్ని క్షమించలేక పోయారంటే, పుత్రవియోగం అంతటి దుర్భరవేదనాజనకమన్నమాట.

అనంతరం, దశరథుడు పెక్కు వేల యేళ్ళు అయోధ్యను పరిపాలించినా నిస్సంతుగానే ఉండిపోయాడు. పుత్రులు కలగలేదనే దుఃఖం నానాటికీ ఎక్కువ కాసాగింది. ఆయన వేదనను కవి ఇలా వర్ణించాడు --

నిస్తుల రాజ్య శ్రీలం, భూస్తుతి గన నేమి ఫల మపుత్రస్య గతి
ర్నాస్తి యని పలుకు గాదె స, మస్తాగమచయము నను చు మది
దలపోయున్" (రామా. 2 - 63)

పుత్రులు లేనివారికి సద్గతులు రావని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ఎంతటి ప్రభువునైనా, ఎంత రాజ్య సంపద ఉన్నా పిల్లలు లేకపోతే దుర్గతులపాలు కాక తప్పదు కదా అని దుఃఖించాడు.

చింతిత ఫలదాయకము,
నిరంతర సుమనో మనోహరమునగు నాహా!
యెంతటివారికి నాత్మజ,
సంతానము సన్నిధాన సంతానముగా! (రామా. **2 - 64**)

ఎంతటివారికైనా, పుత్రుల సన్నిధి స్వర్గధామం వంటిదికదా అని వాపోయాడు.

ధాత్రిన్ బున్నామ్నా నర,
కాత్త్రాయత ఇతి యనంగ గలిగిన తాద్రు
క్పుత్రుని గాంచుటయ కదా,
గాత్రంబూనుటకు ఫలము గణుతింపంగన్? (రామా. **2 - 65**)

జన్మ ఎత్తినదానికి సాఫల్యం పున్నామనరకాన్నుంచి తప్పించే సత్పుత్రుని కనటమేకదా అంటూ, పుత్రులు లేనివారి జన్మ వృథా అంటాడు దశరథుడు. చివరకు ఆయన పుత్రసంతానప్రాప్తికోసం మంత్రులతోనూ, పురోహితవర్గంతోనూ సంప్రదించి, ఋష్యశృంగుడనే మునికుమారుని పౌరోహిత్యంలో పుత్రకామేష్టి జరిపించాలని నిర్ణయించుకుంటాడు. ఋష్యశృంగుని సహాయంతో పుత్రకామేష్టియాగం జరుగుతుంది.

యాగపురుషుడిచ్చిన పాయసాన్ని త్రాగి, కౌసల్యాదులు గర్భాలు ధరిస్తారు. వారికి రామ – లక్ష్మణ – భరత - శత్రుఘ్నులు జన్మిస్తారు. పుత్రజననం ఎంతటివారికైనా సంతోషకరమైన ఘట్టం. సంతానం దంపతుల అన్యోన్యప్రీతికి, స్నేహానికి ఒక గ్రంథి అంటూ, "అన్యోన్యప్రీతికృతోః దంపత్యోః స్నేహసంశ్రయాత్, ఆనందిగ్రంథి రేకోయం అపత్యమితి పఠ్యతే" అంటాడు భవభూతి. అలాగే దశరథుడుకూడా పుత్రోద్భవం వల్ల అమితానందభరితుడవుతాడు. పూర్వీకుల ఋణాన్ని తీర్చుకోగలిగానని సంతోషిస్తాడు.

విశ్వ ప్రియుల గుమారుల,

శాశ్వతులను నల్గురన్ బ్రసన్నుల గని య

య్యీశ్వరుని కంటె ముమ్మడి,

యైశ్వర్యము గాంచి దశరథాధిపు డలరెన్. (రామా. 3 - 122)

రామాదులు నలుగురూ పెద్దవారై, వివిధశాస్త్రాల్లో నిష్ణాతులు అవుతారు. కుమారుల ఆటపాటలనూ, వారి బాల్యచేష్టలనూ, అభ్యుదయాన్నీ చూసి, సంతోషతరంగితమానసుడైన దశరథుడు ఫలితమనోరథుడై, ఆహ్లాదంగా, సుఖంగా గడుపుతున్నాడు. రాజ్యంలో ఏర్పడిన అన్ని ఉత్పాతాలనూ సమర్థంగా ఎదుర్కోవడంలో రామాదులు సమర్థులౌతారు. తమ వీరత్వంతో, శౌర్యంతో తల్లిదండ్రులను, నగరప్రజలనూకూడా సంతోషాంతరంగులను చేస్తారు.

ఇంతలో విశ్వామిత్రుడు వచ్చి, తన యాగసంరక్షణార్థం రామలక్ష్మణులను తనతో పంపవలసినదిగా దశరథుని కోరతాడు. ఆ కోరిక విని దశరథుడు నిశ్చేష్టుడౌతాడు. "మునులు నిర్మోహులనీ, వారికి అనురాగం తెలియదనీ, అందువల్లనే విశ్వామిత్రుడు రామలక్ష్మణులను పంపమని అడగగలిగాడనీ, తన కుమారులు ఇంకా శిశువులనీ మాయోపాయులైన రాక్షసులను వారు ఎలా చంపగలరనీ, వారిని విశ్వామిత్రుని వెంట ఎలా పంపగలననీ, అలాగని ఆయన కోరికను ఎలా కాదనగలన"నీ పరిపరివిధాల నలిగిపోతాడు.

"తన ముద్దుకుమారులెక్కడ, ముని చేసే యాగం ఎక్కడ, ముని ఆ రాక్షసులను చంపటానికి తన పిల్లలను పంపమనటానికి ఆయనకి నోరు ఎలా వచ్చింది" అని నిష్ఠురపడ్డాడు. అలా ఎన్ని విధాల బాధపడినా, చివరకు పంపక తప్పకపోవటంతో వారిని దీవించి పంపుతాడు. కొడుకులు ఎంత సమర్థులైనా, తల్లిదండ్రులకు ఎప్పుడూ పసిబాలురి లాగానే కనబడుతూ ఉంటారనే పితృహృదయం ఇక్కడ చక్కగా ఆవిష్కరించబడింది. అందులోనూ పిల్లలకోసం అంతగా తపించి మరీ కన్న దశరథునికి తన పిల్లలను ముని వెంట పంపటం మరింత బాధాకరం.

రాముడు విశ్వామిత్రుని ఆజ్ఞ ప్రకారం తాటకను వధించి, యాగానికి అంతరాయాన్ని కలిగిస్తున్న మారీచ సుబాహులనే రాక్షసులను అడ్డగించి, సుబాహుణ్ణి చంపి, మారీచుణ్ణి నిగ్రహించి, యాగాన్ని నిర్విఘ్నంగా ముగింప చేస్తాడు. అనంతరం సీతాస్వయంవర ఆహ్వానాన్ని అందుకుని, మిథిలకు బయలుదేరిన రాముడు దారిలో అహల్యా శాపవిమోచనం చేసి, మిథిలలో శివధనుర్భంగం చేసి, సీతను చేపడతాడు.

ఆ సందర్భంలో దశరథుడు విశ్వామిత్రునితో "నీ వెంట పంపిన నా కుమారులను దివ్యాయుధకోవిదులుగా చేసి, నాకు అప్పగించావు. నీ దయవలన వారు దైత్యులనుకూడా సంహరించగలిగినవారు అయ్యారు. నేను కృతార్థుడను అయ్యాను" అంటాడు. "పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడు పుట్టదు –" అన్న సుమతీ శతకకారుని సూక్తిలోని యథార్థతత్త్వం ఇక్కడ దశరథుని మాటల్లో కనిపిస్తుంది. అలాగే వారిని తనతో పంపమని అడిగినప్పుడు విశ్వామిత్రుని పట్ల దశరథుడు తలపోసిన నిష్ఠురాలకు నిష్కృతిగా కూడా ఈ వాక్యం కనిపిస్తుంది.

అనంతరకథలో దశరథుడు రామునికి పట్టాభిషేకం చేయాలనుకోవటం, కైక కోరిన వరాలవల్ల అది భగ్నమవ్వటం, సీతారామలక్ష్మణులు అరణ్యాలకి వెళ్ళటం జరుగుతాయి. దశరథుడు రామవియోగంతో ఘోరున విలపిస్తాడు. ఇక్కడ విరోధాభాసాలంకారంలో కవి ఇలా వర్ణించాడు.

"అవన కాంక్షాపరుడు రాఘవుడు వాసి, నేడు వనకాంక్ష నేగుచున్నాడు" రక్షణశీలుడైన రాముడు నన్ను విడిచి అడవులకు వెళుతున్నాడు, అతన్ని అనుసరించి సీతకూడా అడవులకు ప్రయాణమయ్యింది. అబలయైన ఆమె నడువలేదు నీవు రథము తీసుకునిరా అని మంత్రి సుమంత్రునికి చెపుతాడు దశరథుడు. సుకుమారియైన కోడలికి కలుగబోయే వనవాస కష్టాన్ని తలచుకుని వ్యథ చెందుతాడు.

కానక కన్న సంతానంబు కావున, గానక కన్న సంతానమయ్యె

వరయ గోత్రనిధానమై తోచు గావున, నరయ గోత్రనిధానమయ్యె నేడు

ద్విజకులాదరణ వర్ధిష్ణుడు గావున, ద్విజకులాదరణ వర్ధిష్ణుడయ్యె

వివిధాగమాంత సంవేద్యుడు గావున, వివిధాగమాంత సంవేద్యుడయ్యె

గటకటా దాశరథి సముత్కటకరీంద్ర , కటకలిత దానధారార్ద్ర కటకమార్గ

గామి యెట్లు చరించు నుత్కటకరీంద్ర, కటకలితదానధారార్ద్రకటక తటుల?

ఈ పద్యంలో దశరథుని దుఃఖాన్ని శ్లేషాలంకారపూరితంగా వర్ణించాడు రామభద్రకవి. ఎన్నో నోములు నోచి, ఎన్నో పూజలు చేసి, లేక లేక (కానక) కలిగిన నా రాముడు ఈ రోజు (కానక) అడవులపాలు

అయ్యాడనీ, వంశోద్ధారకుడు (గోత్రనిధానము) అని మురిసిన కుమారుడు పర్వతాలపాలు (గోత్రనిధానము) అయ్యాడనీ, బ్రాహ్మణుల (ద్విజులు) దీవనలందుకుని వృద్ధి పొందవలసినవాడు పక్షుల (ద్విజులు) మధ్య తిరుగుతున్నాడు కదా అనీ, అన్ని వేదాలను, సకల శాస్త్రాలను (వివిధాగమములు) అభ్యసించినవాడు చెట్లు, చేమలు, కొండలు, గుట్టలు (వివిధాగమములు) మధ్య తిరుగాడుతూ కష్టాలపాలు అయ్యాడు కదా అనీ శోకించాడట దశరథుడు.

అలాగే మదించిన ఏనుగుల మదజలంతో తడిసిన నగరవీధులలో తిరుగాడవలసిన నా రాముడు అడవి ఏనుగుల మదజలంతోనూ, రాళ్ళు-రప్పలు, ముళ్ళతో నిండిన అరణ్యాలలో తిరుగాడవలసి వచ్చిందని, స్వజన, పరిజనుల మధ్యలో ఎంతో ఉత్కృష్టపరిస్థితులలో ఉండవలసినవాడు నికృష్టపరిస్థితులలో ఉన్నాడు కదా అని విలపించాడు, పరిపరివిధాలుగా దుఃఖించాడు దశరథుడు. ఇక్కడ రాముణ్ణి వీడి, తాను ఎలా జీవించాలనే బాధ, అడవుల్లో వారు ఎలా జీవిస్తారో అన్న ఆవేదనా ఒకదాన్ని మించి ఒకటి కనిపిస్తాయి.

సీతారామలక్ష్మణులు వెళ్తున్న రథాన్ని ఆయన ముందు అది కనిపించినంతవరకు చూశాడట. తర్వాత రథం కనబడకుండాపోగా దూరంగా అది వెళ్తుండగా రేగిన దుమ్మును చూశాడట. చివరకు అదికూడా కనబడకపోవటంతో వారిని తలచుకుని, దుఃఖపరవశుడై శోకించాడట. రథం వెళ్తున్న మార్గంవైపే దృష్టి మరల్చకుండా చూస్తున్న దశరథుని పరిస్థితి ఎంతో దుఃఖాన్ని కలిగిస్తుంది. పుత్రవియోగసమయంలో తండ్రిపడే ఆవేదనను వర్ణించటంద్వారా పిల్లలు ఏదైనా దూరదేశాలకో, లేదా రక్షణ వ్యవస్థల్లాంటివాటిల్లో సేవలు అందించటానికో వెళ్ళినప్పుడు తల్లిదండ్రులు వారిని తలచుకుంటూ బాధపడటం, వారు లేరుకదా అని నిట్టూర్చటం, నిరాశచెందటం లాంటి సహజమైన దృశ్యాలను కవి కళ్ళముందు నిలిపాడు.

ఈ విధంగా పుత్రులకోసం విలపిస్తూనే తన ప్రాణాలుకూడా వదిలాడు దశరథుడు. సంతానం కోసం ఎన్నో నోములు నోచి, వారి పైనే ప్రాణాలు పెట్టుకుని, వారిని విడిచి ఉండలేక, చివరికి, వారికోసమే దుఃఖిస్తూ మరణించిన దశరథుని పుత్రప్రేమ - పితృప్రేమకే తలమానికం.

వాల్మీకి మహర్షి "యావత్స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే" అనె శ్లోకంలో రామాయణం ఈ భూమిపై చిరస్థాయిగా ఉంటుందంటాడు. అలాగే పిల్లలకు దూరంగా నివశిస్తున్న ప్రతి తండ్రిలోనూ దశరథుడు మనకు దర్శనమిస్తూనే ఉంటాడు.

*******